క్లుప్తంగా

భయపడొద్దు.. అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ(నూజెండ్ల): ప్రజాతీర్పును గౌరవిస్తూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఆయన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వినుకొండ ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేశానని, ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తూ తనకు ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించి గొడవలకు వెళ్లవద్దని సూచించారు. ఓటమి శాశ్వతం కాదని, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. వినుకొండ ఎమ్మెల్యేగా గెలిచిన జీవీ ఆంజనేయులుకు శుభాకాంక్షలు తెలియజేశారు. వినుకొండను అభివృద్ధి చేస్తూ ప్రజలకు మంచి పనులు చేయాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్-2023 పరీక్షలో ఐదుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ బి.రవినాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఈ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన షేక్ రాఫియా తబుస్సన్-122 మార్కులు, ఉప్పు శ్రీకృష్ణ చైతన్య-117 మార్కులు, పోలిశెట్టి రమ్య-111 మార్కులు, పేరుపోగు శైలు-110 మార్కులు, డి.జ్యోత్స్న చౌడేశ్వరీ-110 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచి స్కాలర్ షిప్‌కు అర్హత సాధించారన్నారు. విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ అర్హత సాధించటం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు సంవత్సరానికి రూ.12 వేల రూపాయల చొప్పున ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పూర్తి అయ్యేవరకు రూ.48 వేల రూపాయలు చెల్లిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు.

మాదల విద్యార్థినికి నీట్‌లో 619 మార్కులు




మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామానికి చెందిన గుంటూరు షణ్ముకమాల్య మంగళవారం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో 619 మార్కులు సాధించింది. మాదల గ్రామానికి చెందిన గుంటూరు శ్రీనివాసరావు హైదరాబాద్‌లో స్థిర పడ్డాడు. షణ్ముక మాల్య అక్కడే ఉన్న ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్‌మీడియట్ చదివి 972 మార్కులు సాధించింది. నీట్ పరీక్షకు హాజరై మొదటి విడతలోనే 619 మార్కులతో ఆలిండియా కోటాలో 60,062 ర్యాంకు సాధించింది. కేటగిరిలో 22,016 ర్యాంక్ సాధించింది.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాస మాసశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. విశేష ద్రవ్యములతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అమ్మవారిని, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. చండీపారాయణం, పూర్ణాహుతి తదితర విశేష పూజలు చేశారు. పలుగ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

వైఎస్సార్ సీపీ ఓటమి తట్టుకోలేక వృద్ధురాలు మృతి



దాచేపల్లి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమి తట్టుకోలేక గుండెపోటుతో ఓ వృద్ధురాలు మంగళవారం రాత్రి మృతి చెందింది. దాచేపల్లి మండలం ముత్యాలంపాడుకి చెందిన వంగూరి పిచ్చమ్మ(72) అనే వృద్ధురాలు వైఎస్సార్ సీపీ ఓటమి చెందిందని తెలుసుకుంది. ప్రతి నెలా ఇంటికే పింఛన్ ఇస్తున్న తమ జగనన్న పార్టీ ఓటమి చెందడాన్ని తట్టుకోలేక పిచ్చమ్మ ఒక్కసారిగా గుండెపోటుకు గురై ఇంట్లో కుప్ప కూలింది. కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కి తరలించే క్రమంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పిచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీకి ఎనిమిది రౌండ్లలో మెజార్టీ

- మొత్తం 18 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి
- గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ, పట్టణంలో టీడీపీ అభ్యర్థికి మెజార్టీ



లెక్కింపును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి లత్కర్ (ఫైల్)

నరసరావుపేట: జేఎన్‌టీయూలో మంగళవారం నిర్వహించిన నరసరావుపేట నియోజకవర్గ కౌంటింగ్‌లో ఎనిమిది రౌండ్లలో వైఎస్సార్ సీపీ, 10 రౌండ్లలో టీడీపీ అభ్యర్థికి మెజార్టీ లభించింది. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,32,778 కాగా వాటిలో 1,87,961 ఓట్లు పోలయ్యాయి. వీటితో పాటు 3156 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడ్డాయి. ఈవీఎంలలో పడిన ఓట్లను మొత్తం 18 రౌండ్లుగా లెక్కించారు. కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు 1,03,167 ఓట్లు పోలుకాగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి 83,462 ఓట్లు పోలయ్యాయి. మరో 1052 ఓట్లు నోటాకు వేశారు. లెక్కింపులో మెజార్టీని పరిశీలిస్తే గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి స్వల్ప మెజార్టీ రాగా, టీడీపీ అభ్యర్థికి పట్టణంలో భారీ మెజార్టీ వచ్చింది. దీంతో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు రౌండ్ల వారీగా సాధించిన మెజార్టీలను పరిశీలిస్తే...

రౌండ్	వైఎస్సార్‌సీపీ	టీడీపీ	మెజార్టీ	
01	5883	4610	1273	(వైఎస్సార్‌సీపీ)
02	5544	4704	840	(వైఎస్సార్‌సీపీ)
03	6536	4441	2095	(వైఎస్సార్‌సీపీ)
04	3921	4980	1059	(టీడీపీ)
05	4442	6550	2108	(టీడీపీ)
06	4159	7503	3344	(టీడీపీ)
07	5264	4951	313	(వైఎస్సార్‌సీపీ)
08	3752	7646	3893	(టీడీపీ)
09	3759	8010	4251	(టీడీపీ)
10	3385	6535	3150	(టీడీపీ)
11	3767	4798	1031	(టీడీపీ)
12	4809	6038	1229	(టీడీపీ)
13	5127	6521	1394	(టీడీపీ)
14	3159	7047	3888	(టీడీపీ)
15	4069	3216	853	(వైఎస్సార్‌సీపీ)
16	5943	5024	919	(వైఎస్సార్‌సీపీ)
17	5586	5705	119	(వైఎస్సార్‌సీపీ)
18	3166	2992	174	(వైఎస్సార్‌సీపీ)
పోస్టల్‌ఓట్లు	1191	1897	706	(టీడీపీ)

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్ర పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఎస్. రేవతిబాయి తెలిపారు. మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మర్రిచెట్టుపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియాపై అవగాహన కల్పించారు. జ్వరం వస్తే ఏఎన్‌ఎంను సంప్రదించాలన్నారు. ఇంటి చుట్టు ప్రక్కల నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. విధిగా దోమతెరలు వాడాలన్నారు. అలాగే ఖాళీ పాత్రల్లో నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. తలనొప్పి, జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సురేష్ కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్ ఎ.గోవిందయ్య, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



పట్టణంలో ర్యాలీ చేస్తున్న మలేరియా, ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

సత్తెనపల్లి: దోమలు కుట్టకుండా.. పుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా 2024 జూన్ మాసంను ప్రభుత్వం మలేరియా వ్యతిరేక మాసోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ఆరోగ్య, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాలుగో సచివాలయం జెండా చెట్టు నందలి సచివాలయంలో బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ రత్నాకర్ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు, తదితర వ్యాధులు రాకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రజలందరూ నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా, డెంగీ వ్యాధులు వ్యాప్తి చేసే ఎనాఫిలస్, ఈడిస్ ఈజిప్ట్ జాతి దోమలు మంచినీటిలోనే గుడ్లు పెట్టి తమ సంతతిని వృద్ధి చేస్తాయన్నారు. వర్షాకాలంలో వర్షం నీరు నిల్వ ఉండే అవకాశం ఉన్న పనికిరాని ప్లాస్టిక్ డబ్బాలు, పాత టైర్లు, పూల కుండీలు, తొట్లు, రోళ్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, టీ కప్పులు, మొదలైన వాటిలో నీరు చేరకుండా పారవేయాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి బీపీ చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు బి.రోశయ్య, వై.రాజేష్‌పాల్, ఎం.నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్, షేక్ హుస్సేన్, షేక్ షరీఫ్, సచివాలయ హెల్త్ సెక్రటరీ టి.ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్త రాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కేంద్రియ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అహ్మద్ ఫరూక్



గణపవరంలో మొక్కలు నాటుతున్న కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ అహ్మద్ ఫరూక్, సిబ్బంది



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న చిన్నారులు



పర్యావరణ సమతుల్యతకై ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది

నాదెండ్ల: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్రియ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అహ్మద్ ఫరూక్ చెప్పారు. గణపవరం సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రియ విద్యాలయం (ఇర్లపాడు)లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అవి వృక్షాలయ్యేంత వరకూ సంరక్షించినపుడే పర్యావరణ సమతుల్యత సాధ్యమన్నారు. ఇంటి సమీపంలోని ఖాళీ స్థలాలు, రహదారుల వెంబడి మొక్కలు నాటి అవి పచ్చటి చెట్లయ్యేలా కాపాడాలన్నారు. మనం చెట్లను కాపాడితేనే అవి జీవకోటిని కాపాడతాయనే విషయాన్ని ఎవరూ మరువరాదన్నారు. విచ్చలవిడిగా చెట్లు నరికిన ఫలితంగా ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు, కాలుష్యం నమోదవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో బాలాజీ, సిబ్బంది నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకంపై చిన్నారులు మక్కువ పెంచుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను బాధ్యతగా చేపట్టాలనీ, అప్పుడే వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని వివరించారు. విచక్షణా రహితంగా చెట్లను నరికి వేయడంతోనే వేసవిలో ఎండ తీవ్రత అంతకంతకు పెరుగుతున్నదని తెలిపారు. చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామి రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వి.రెడ్డిపాలెంలో....

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవటం మనందరి బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణలో తోటివారితో పాటు కుటుంబ సభ్యులను కూడా భాగస్వాములయ్యే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఒకసారి వాడి పారేసిన ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందన్నారు. ఫలితంగా భూమి వేడెక్కుతుందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే సమస్త జీవ మనుగడే కష్టతరం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలన్నారు. చెట్లు పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకై నినాదాలు చేశారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతకై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్



అక్షిత, జ్ఞానకావ్యశ్రీ, సంజన, మహ్మద్ ఆసిఫ్

క్రోసూరు: క్రోసూరులోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ మేరీ సూజన్ బుధవారం తెలిపారు. అక్షిత, జ్ఞాన కావ్యశ్రీ, సంజన, మహ్మద్ ఆసిఫ్ ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రారంభమైన ఇంటర్ తరగతులు, అడ్మిషన్లు

మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఈ నెల 1వ తేదీ నుంచి సీనియర్ ఇంటర్, బుధవారం నుంచి జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభమైనట్లు ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు ఒక్కో గ్రూపుకు 40 మంది చొప్పున 160 మంది విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. కాలేజీలో అడ్మిషన్లు పొందిన వారికి ఇప్పటికే ఫోన్ ద్వారా తెలియపరచటం జరిగిందన్నారు. కావున కాలేజీలో చేరదలిచిన విద్యార్థులు టీసీ, పదవ తరగతి మార్క్స్ లిస్టు, ఆధార్‌కార్డు కాపీ, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ యువకుడు జెండా చేతబూని కులం పేరుతో దూషించాడని కాలనీ వాసులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 4వ తేదీ ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామంలోని టీడీపీకి చెందిన పులుచూరి వెంకట్రావు అనే వ్యక్తి కారుతో కాలనీలోకి ప్రవేశించి నానా దుర్భాషలాడారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న 144 సెక్షన్

ఎస్ఐ ఆంజనేయులు



రెంటాల గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు



144 సెక్షన్‌తో నిర్మానుష్యంగా ఉన్న పోలీస్ స్టేషన్ సెంటర్

రెంటచింతల: మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు రెంటచింతల మండలంలోని వివిధ గ్రామాలలో 144 సెక్షన్ కొనసాగుతుందని ఎస్ఐ ఎం.ఆంజనేయులు బుధవారం తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా ప్రధాన సెంటర్లలో గుంపులు గుంపులుగా ఉండరాదని, ఈ సమయంలో ఎవరూ కూడా బాణసంచా కాల్చరాదని పేర్కొన్నారు. రాళ్లు, కర్రలు, ఆయుధాలతో సంచరించినట్లయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామాల ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడిన, చట్ట వ్యతిరేక పోస్టులు పెట్టినా వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదుచేయడంతో పాటు రౌడీషీట్లు ఓపెన్ చేసి పీడీ యాక్ట్ ప్రయోగించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందన్నారు. స్పెషల్ డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు నేతృత్వంలో మొత్తం 90 మంది పోలీసులతో గ్రామాలలో దాడులు, అల్లర్లు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు.

కర్ఫ్యూ వాతావరణంలో పిడుగురాళ్ల

పిడుగురాళ్ల: 2024 సార్వత్రిక ఎన్నికలు మే 13వ తేదీన జరిగాయి. ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఈ నెల 4వ తేదీన జరిగింది. ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు 144 సెక్షన్ పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అమలులో ఉంది. ఎన్నికల సమయంలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యంత్రాంగం ఎన్నికల కౌంటింగ్ అనంతరం కూడా ఎక్కడా గొడవలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వ్యాపార సముదాయాలన్నీ కూడా మూసివేయాలని ఆదేశాలు జారీ చేయటంతో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. దీంతో పిడుగురాళ్ల పట్టణంలోని ప్రధాన రహదారిలో కర్ఫ్యూ వాతావరణం తలపించింది. ప్రజలు ఏదైనా అత్యవసరమైతేనే రోడ్లపైకి వచ్చి వారికి కావల్సిన అత్యవసర వస్తువులు తీసుకొని వెళ్లారు. పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తు కారణంగా ఇప్పటి వరకు పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు ప్రశాంత వాతావరణాన్ని కల్పించారు.

గురజాలలో 144 సెక్షన్

గురజాల : గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని మరలా అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పల్నాడు ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దుకాణాలు, హోటళ్లు, చిల్లర దుకాణాలు మూసివేయడంతో రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎటువంటి గొడవలు జరగకుండా డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐ టి.బాలకృష్ణ, ఎస్ఐలు సౌందర్యన్ రాజన్, బి.అనంతకృష్ణలు బందోబస్తు నిర్వహించారు.

భూసార పరీక్షలతో సాగుకు జీవం

- వాటి ఫలితాల ఆధారంగానే పోషకాల అంచనా
- రైతులకు కార్డుల రూపంలో ఫలితాలు



కందులవారిపాలెంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

సత్తెనపల్లి: భూమిలోని పోషకాలు, లోపాలను తెలుసుకొని అందుకు అవసరమైన విధంగా ఎరువులు వాడుతూ సాగుచేసినప్పుడే రైతులకు ఆశించిన ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం చాలామంది రైతులు సాగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో దిగుబడులు కోల్పోతున్నారు. రైతుకు తోచిన విధంగా వ్యవసాయం చేయడం, ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం, విచక్షణా రహితంగా మందులు, ఎరువులు వినియోగించడం, తదితర కారణాలతో వ్యవసాయంలో ఆశించిన ఫలితాలు పొందలేక పోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది గ్రామాల్లోని రైతులకు భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనా సేకరణ, పరీక్షలు చేయించుకునే విధానం, వాటి ఆధారంగా పంటలు సాగు చేసే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మట్టి నమూనాల సేకరణకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

మట్టి నమూనాల సేకరణ ఇలా...

భూమిలో రకాలను బట్టి ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకూ ఒక నమూనాను సేకరించవచ్చు. మట్టి నమూనాలను సేకరించాల్సిన భూమి రంగు, ఎత్తు, వాలును బట్టి చౌడు వంటి సమస్యలను కూడా దృష్టిలో ఉంచుకొని భాగాలుగా విభజించాలి. వేరు చేసిన భాగాలను వేర్వేరు భూములుగా గుర్తించి ప్రతి భాగం నుంచి వేర్వేరు నమూనాలు సేకరించాలి. నమూనా తీయాల్సిన చోట చెత్తాచెదారం లేకుండా చేతితో పక్కకు తోయాలి. నాగలి సాలు పోయేంత వరకు ఆరు అంగుళాల లోతు మేర వీ ఆకారంలో తవ్వాలి. ఇలా తవ్విన గుంతలో నుంచి అరకేజీ వరకు మట్టిని సేకరించాలి. మొత్తం మట్టిని కలిపి వాటిలో ఉండే రాళ్లు, వేర్లు, కొయ్యలు, చెత్తను శుభ్రం చేసుకోవాలి. మట్టి తడిగా ఉంటే నీడలో ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత మొత్తం మట్టిని నాలుగు భాగాలుగా ఉంచి రెండు భాగాలు తీసివేయాలి. మిగిలిన రెండు భాగాల్లో అరకేజీ వరకూ ఉంచుకోవాలి. ఈ మట్టిని శుభ్రమైన సంచిలో గానీ, గుడ్డ సంచిలో కానీ నింపుకోవాలి. రైతు పేరు, సర్వే నెంబర్, ఊరు, వంటి వివరాలు రాసి అందులో ఉంచాలి.

వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా భూసార పరీక్ష కేంద్రాలకు..

గ్రామాల్లో సేకరించిన మట్టి నమూనాలను సిబ్బంది సమీపంలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపుతారు. వీటిని ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం ఫలితాలను రైతులకు కార్డుల రూపంలో అందిస్తారు. పరీక్షల్లో వచ్చిన ఫలితాలను బట్టి పొలాల్లో నెలకొన్న సమస్యలు, అనుసరించాల్సిన పద్ధతులు, ఎరువుల మోతాదులు, ఇతర వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తెలియజేస్తారు.

మట్టి నమూనా సేకరించకూడని ప్రాంతాలు

మట్టి నమూనాలు సేకరించాల్సిన పొలంలో గట్టు, నీడ, చౌడు వంటి ప్రదేశాలను గమనించాలి. చెట్ల నీడ, బురద ఉండే ప్రదేశాలు, తేమగా ఉన్నచోట నమూనాలు సేకరించకూడదు. పొలం గట్లు, ఎరువు కుప్పలు, పైరుకు దగ్గరగా నమూనాలు సేకరించకూడదు. సున్నం, బూడిద, రసాయన ఎరువులు వేసిన మూడు నెలల వరకూ తీయకూడదు. ఈ జాగ్రత్తలు తీసుకుంటే భూసార పరీక్షలు కచ్చితంగా వస్తాయి.

నేలను కాపాడుకోవాలి



ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నేల ఆరోగ్యంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటాం. మట్టి పరీక్షల ఆధారంగా రైతులు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. పెట్టుబడులు కూడా బాగా తగ్గుతాయి. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మట్టి నమూనాలు సేకరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, సత్తెనపల్లి